ఎంత ముసలివారైనా దీపావళికాంతికి పునఃశ్శైశవం విజృంభించి టపాకాయ కాలుస్తారే! అలా పై వెలుగున ఆ దంపతులు నాటిరేయి పునర్యౌవనము రేకెత్తినవారై—వారు—ఆ దంపతులు—గది కిటికీతలుపులు గాలికి మూతబడ్డాయి!

.... .... .... .... ....

## అంతులేని ఆకలి

"నెం 1 కలకత్తామెయిల్ మద్రాస్ సెంట్రల్‌స్టేషన్ 19 గంటలకు సరిగా వదులును" అని నల్లని అచ్చుక్షరాల్తో రైల్వేగైడ్‌లో తేట తెల్లంగా 1వ అక్టోబరునుంచీ కనబడుతున్నా, డిశంబరు 20వ తేదిని బయలుదేరినవారిలో చాలామంది, తమకు రైలు దాటి పోయేటంత ఆలస్యంగా సన్నాహలై స్టేషనుకువచ్చి ప్లాట్‌ఫారమ్ మీద కంగారుకాపరిచినవారే, మగాళ్ళ మాట చెప్పకండి! వాళ్ళకు వేయిపన్లు! ఆడవాళ్ళు? అందులోనూ ఆ! ఆ! ఆ యువతి? ఆమెపేరు? వినయమ్మ. ఆమె ఓచేత ట్రంకుపెట్టె, ఓచేత బెడ్డింగు బరువుగా మోచుకొంటూ, ఆడవాళ్ళబండీ ఎక్కడండీ? ఎక్కడండీ? నే నెక్కేదాకా ఉంటుందా? టైముందా?" అంటూ టిక్కట్టు కత్తిరించే ఆతన్ని అడుగుతూ అతని జవాబు వినకుండా ముందుకు చొఱబడిపోతూ అప్పుడామె పడిన చీకాకు వర్ణనాతీతము! ఒకానొక యువకుడు "ఇక్కడ! ఆడవాళ్ళ బండీ ఎక్కండ" ని దారిచూపించే వఱకూ ఆమె క్కావలసిన పెట్టి కనబడనేలేదు, మొత్తానికి ఇలా రైలెక్కింది. అల్లా మెయిల్‌బండీ వచ్చింది.

ఎలాగైతే వినయమ్మ అప్పటికి మూడేండ్లనుంచి చన్న పట్నంలో మెడికల్ కాలేజీలో చదువుకొంటూవున్న నేటివ్ క్రిష్టియన్ యనే. పట్నం ఆనూపానూ బాగాయెఱిగి వున్నదే. అయినప్పటికీ సెలవులిచ్చారన్న సంతోషంకొద్ది ఆ సాయంకాలమే తన స్వంతయూరికి వెళ్ళిపోదామనే సంకల్పం కలిగి, కొనవలసిన వన్నిట్నీ కప్పుడాలోచించుకొ్కనుకొ్కని బసకువచ్చి భోజనం గావించుకు స్టేషన్కు రావడంలో ప్రాణం కడట్టినంత పనైంది. "ఆడవాళ్ళ బండియిక్కడ!" అని తనకుదారి చూపించిన యువకుడెవడో ఆమె కనిపెట్టనేలేదు. వాని కోసంగాను, తాను బండియెక్కి దానే పెట్టి బేడా సర్దుకున్నాకైనా ఆమె యివలకు తొంగిచూచిందికాదు తిన్నగా బెడ్డింగు పరుచుకొ్కచుని, బెడ్డింగులో కుర్చ్కొని తన రైల్వేగైడ్ తీసిందై పుటచూచి "సరిగ్గా 7 గంటలకేనా?" అని స్వగతంగా అనుకొని తనరిస్టు కేసిచూచి "ఇందువల్ల పొరబడి పోయాను. నా గడియారం అయిదు నిమిషాలు స్లో! ఇస్ ఎంత ఆయాసమైంది?" అని అనుకొంటూ, తలగడాకు తలగడా తొడుక్కు మధ్యగల అవకాశంలోనుంచి ఓ టర్కిష్ టవల్ బొంతుది బుస్సున దూసి నుదురూ ముంజేతులూ తుడ్చుకొని, అక్కడనుంచి క్రమశః స్థాయినిపడింది. రైలువేగం హెచ్చినకొద్దీ ఆవలి చీకటిగుండా గాలి కిటికీలోకొ్కడుతూ ఆమె ముంగురుల్ని చెదరిస్తూ వుంటే కొనగోళ్ళతో సంస్కరించుకునే చక్కని చేష్టలోకి కూడా దిగింది. అంతలో—అర మోడ్పుకనుదోయి, నెఱ మోడ్పుకనుదోయి, నెఱ మోడ్పుకనుదోయి, అరమోడ్పు కనుదోయి—గా నిద్దురపోయింది.

గూడూరు ఆగుడు తావుకడ యువకుడు, తేనీరుగ్రాగుడు తెచ్చి "టీ పుచ్చుకుంటావా? చాలా అలసి పోయియుంటావు"

అని అడిగాడు. వినయమ్మ చివాల్నలేచి కూర్చుని కిటికీలోంచి తొంగిచూచింది. తొంగిచూస్తూ, హల్లో! గుడ్‌మార్నింగ్ మీరేనా నాకు సెంట్రల్లో ఈ బోగీ చూపించింది? థాంక్సు. వెరీమెనీ థాంక్సు." అంటూ తేనీటి కప్పు సాసర్ సమేతంగా అందిపుచ్చుకుని గడగడా త్రాగేస్తూవుంది. యువకుడు "నోహర్రీ! నెల్లూరు దగ్గఱ ఎమ్టీస్ ఇవ్వవచ్చును" అన్నాడు. అంటూ అంతలో రైలుకూస్తే యువకుడు తిరోహితుడైనాడు. బండీ కదిలింది.

వినయమ్మతోపాటు ఆడవాళ్ళ పెట్టిలోవున్న ఇతర అమ్మలక్కలలోక కొందఱు "ఎవరమ్మా మీరు?" అని అడిగారు. వినయమ్మ, "క్రిష్టియనులం" అంది. "ఆ అబ్బాయి మీ ఆయనా?" అని అడిగారు. వినయమ్మ తనలో "ఇదే హిందూ ఇడియసీ! శుద్ధ మొఱటులు. ఫెడీమని అడిగేసేస్తారే కాని కించిత్తూ ఆలోచించరు." అని తలపోసికొని జవాబు చెప్ప కుండానే అప్పటికప్పుడే చిఱు చలిలోనికి కాలమానం మారుతూ వుంటే, రగ్ పైకితీసుకు కాళ్ళమీద వేసుకొని, ఒక్క గుటగ్గా పీల్చేసిన కప్‌సాసరు దూరంగా జాగ్రత్తగా బల్లమీదనేవుంచి, "పంచ్" మాగజైనులో ఎదోచూస్తూ క్వచిత్ క్వచిత్ హసించు కొంటూ కూర్చుంది.

నెల్లూరు స్టేషన్ వచ్చింది. యువకుడు తిరిగివచ్చి, ఏలా వుందంటారు? టీ? ఇటీస్‌మైమేక్! ఇంకా కావలిస్తే బిట్ర గుంటలో ఫ్లాస్కు ఫ్లాస్కు మీ పరంచేయంగలాడ! నన్నాడు. వినయమ్మ, "నో! థాంక్సు" అన్నది. అంటూ ఉత్తి కప్పు సాసరు, అందుమీద జపాన్‌చిత్రపు బొమ్మలు తోలుబొమ్మల్లా

అల్లల్లాడేనో ? అందించింది. యువకుడు సామగ్రి అందిపుచ్చు కుంటూ వెళ్ళిపోతూవుంటే బండీలోని ఓ బ్రాహ్మణ ముసలమ్మ చొరవచేసి, "మీదేవూరు నాయనా ?" అని అడిగింది. యువకుడు "ఏవూరైనా మీవూరుకాదు" అంటూ "రైటెబౌట్ టర్న్"గా నిష్క్రమించాడు. వినయమ్మ మెల్లగా ఆ బ్రాహ్మణ స్త్రీవంక తిరిగి, అవ్వగారూ ! రైల్లో ప్రయాణంచేసేవారి అందరి వూసూ మీకెందుకండీ !" అని అడిగింది. అంటే బ్రాహ్మణ స్త్రీ "నీ వూసు అతగాడు పట్నం స్టేషన్‌లో కలగజేసికోబట్టేనే ఈ రయిలెక్కగలిగావు, ఇలా మాతో కూచో గలిగావునీవు ? అని ఎదుర్కొంది, వినయమ్మ "ట్రూ ! ట్రూ !" అంటూ మరివాదం పెంచలేదు. ముసిలమ్మ "తుర్ ! తుర్ ! నాలుగు ఇంగ్లీషు ముక్కలు వస్తే భూలోకంలో నిలబడలేరు ఎటువంటి వాళ్ళూను." అని తక్కుంగలవాళ్ళవైపు తిరిగి "చూడండమ్మా! వాడున్నాడే ఆ గుంటడు ముఖం బాగా కనబడలేదు నాకు. అయినా పోల్చాను. మా వూరు "గిడసా" వారి చిన్నవాడు. మతోడవితే వానితో నాకేంపని ? అంటూ స్థలం సూచుకు నడుం వాల్చింది. వినయమ్మ వంగోలు దాకా ఓ నవల చదువుకొంటూ స్వయానికి తెలియకుండానే ఆ పుస్తకాన్ని అలా మీదకు జార విడుచుకున్నదై యొకానొక స్వర్ణ స్వప్నార్ణవంలో ఈదు లాడుతూవుంది. రైలు నడకకు పుస్తకం "వక్షభూషణం" వా అన్నట్టు ఆమె యెదపుట్టువుల వద్దున క్రొవ్వాడివేడి మిటారి పోడుములమిట్టి మిన్నుముట్టి నట్టంముట్టం ద్రొక్కుతూ వుంది.

యువకుడు మళ్ళా వినయమ్మవున్న పెట్టివద్దకు రాలేదు. గోదావరిస్టేషన్‌లో ఆమె దిగవలసివుంది. యువకుడు గోదావరి

స్టేషన్‌లో దిగుతాడో రాజమండ్రి స్టేషన్‌లో దిగుతాడో ఆమెకు తెలియదు. ఆమె ఎప్పుడూ అడిగి వుండలేదు. అసలతడెక్కడికి టిక్కట్ తీసికున్నాడో ఆమెకు భోగట్టాలేదు. తనతో ఆ రైల్లో ఆ రోజున అతగాడాలా ఆదాకా వెంబడించి వుంటాడనికూడా ఆమె అనుకొని యుండలేదు. ట్రూ ! వారొకరి నొకరెరుగుదురు. అయితేం ! వినయమ్మ సెంట్రల్లో ఏలా తనరేకు బొక్కుసా, బూరుగుదూది రొజాయి పుచ్చుకు రైలెక్కిందో ఆలాగే అస హాయంగా గోదావరి స్టేషన్‌లో దిగిందై చేతులవలంబలం కన బరుస్తూ సామాను పైకెత్తి, కటకటాలావల ఓ బండివానికి అందిచ్చింది. తాను దర్జాగా టిక్కట్ చూపించుకుంటూ గేటుదాటి యివలకువచ్చి బండిలో కూర్చుంది. బండిని తిన్నగా జండా పంజారోడ్డంట తోలమంటూవుంది.

అప్పటికప్పుడే తన బిచాణాతో యువకుడో జట్కా ఎక్కి గుడ్‌బై " అన్నాడు. వినయమ్మ అతణ్ణి పరికిస్తూ " ముసిలమ్మ ప్రశ్నకు బెదరిపోయినావుటోయ్ ! మళ్ళీపికర్ లే!" అంది. ఆలా అంటూవున్న తన స్నేహితురాల్ని పెడమోముగా చూచి జట్కావాణ్ణి " తోలరా ! ఏమిటి చూస్తావు నీవూను ? " అంటూ తొందరపెట్టాడు యువకరత్నం. ఆనాటికా ప్రియు లొండొరుల నెడబాసినారనే మనం అనుకోవాలి :

మర్నాడాదివారం. సాబత్‌డే. ఉదయం వినయమ్మ శ్రద్ధగా ముస్తాబైంది. జడకు రిబ్బను కరిపిస్తే ఎక్కడ నేలంటి పోతుందో అనే దూరదృష్టిని జటచివళ్ళు ఆలాగే వదిలేసింది. ముంగురులు ఎగదువ్వితే అవెక్కడ చెట్లకొమ్మలందుకుంటాయో అనే పైచూపుని, ఎలా వృంగ్రాలు చుట్టుకుపోయిన వాటినాలాగే

మెలితిరుగనిచ్చి వూరుకుంది. నల్లని వొంటికి తెల్లనియొల్లె. ఒల్లెలోపలమఱీ మఱీ యుల్లిపొర మస్లిన్ కబ్బా. కబ్బాక్రింద మిటకరించి చూస్తూవున్నట్టున్న బాడిస్—బైబిలు అలాగుండెకు ఆనించుకు ఇక చర్చికి నడకసాగిద్దామని అనుకుంటూ కాలమును గురించి యోజించింది. వో త్రుటి. ఇంట.గడియారం. బయట గడియారంకూడా ఎనిమిది కొట్టాయి. ఫాదిరి గుడిగంటలు మోగుతున్నాయి. మణికట్టు చూచుకుంటూ టైమైంది అని నిర్ధారించుకొంది. ఇలువెడలి రోడ్డుమీద కాసే సీతాకాలపు వెచ్చ యెండలో తనసీడ అలాపడనిచ్చింది. పడనిచ్చిందోలేదో ఆమె ప్రాణస్నేహితుడు, కధానాయకుడు, ఆమెకు ప్రత్యక్షమయి "సుప్రభాతమ్ !" అన్నాడు. వినయమ్మ "నేనిప్పుడు చర్చికి వెడుతున్నానండీ !" అంటూ మిత్రుని తొల్లింటి ముఖవికాసాన్ని తనలోనిముద్చుకొన్నదై పైకి ప్రతివికాసాన్ని పొడగట్టనివ్వకుండా "ఏలాగైనా సంఘబలం ప్రేమబలం కంటెమిన్న !" అంది. యువకుడు "అన్నింటికంటె సృష్టిబలంమిన్న" అంటూ ఒక ఇన్విటేషన్ కవర్. "ఇది నాపిలుపు—కమ్మ" అంటూ ఆమె చేతికిచ్చి "ఇప్పటికి సెలవు" అన్నాడు. అని ఒక్క నిమిషమైనా మఱి ఆగలేదతడు. గిరుక్కున వెనుదిరిగి వెళ్ళిపోయినాడు. చఱచఱ అలా వెళ్ళిపోతూవున్న అతనికేసి వినయమ్మ ఓ రెప్పపాటు మాత్రంగా చూచింది. తరుణ విలసనమున కనువుగానుండు పరిశుభ్రపు ట్రౌజర్సు, షర్టు, కోట్, టై, హేట్, బూట్. అన్నీధరించిన అతనిరూపం కనుగట్టుగా గ్రహించుకొన్నదై వినయమ్మ తనచేత నతడుంచిన కమ్మను, అలాసొరుగులోకి చొప్పించినట్టు చనుకట్టు, జేబులోకి చొప్పించుకు చట్టాగమనించింది. క్రిష్టియన్ వాడలోని ఎందరెందరో

జాటనే చర్చికి వెడుతూవున్నారు. వారిలో ఒకరు, వినయమ్మా! అక్కడల్లా నిలబడిపోనావేం? రావేం?" అని అన్నారు. ఆ మాటకు మేలుకొన్నట్టు తెలివిగొన్నదై వినయమ్మ వారితో కలిసి ప్రార్థనకు వెళ్ళింది. చర్చిలో ఏలాగో బైబిల్‌చాటు మాటునే తన రైకజేబులోని పత్రం పైకితీసికొని, చదువుకొని. ఆ పవిత్రగ్రంథపు బుటలనడుమనే ఉంచుకోని ఇంటికి చక్కా వచ్చింది.

ఇంటికి చక్కావచ్చి నప్పట్నుంచి ఆమెకావించిన ఆలోచనకు మితిలేదు. ఆ అహ్వానము "వొకపరి నింకనొక్కపరి నింకొొక మారిక నొక్కమారు" పఠించుకుంది,—"రంప"— "ఎక్కడుంది అది?"—అక్కడకునన్ను తీసుకునివెళ్ళి నన్ను పెద్దకొండ ఎక్కించి అక్కడ నాకు తేనీరు పానీయమిచ్చి ఫలాహారం పెట్టి పట్టాభిషేకం గడతాట్ట!" నమ్మనా?— "ఎనైన్ ఎక్స్కర్షన్‌టు దిహిల్స్—గొప్పగా కొండలమీదుంటాము!" అనికూడా వ్రాసినాడు. నాకు కొండలంటే మహాయిష్టం! తప్పకుండా వెడతాను. ఏమైనాసరే!"—అని నిశ్చయించుకుంది. ఇంకా—"వుయి విల్‌బి దేర్ ఎబవ్‌మాన్ అండ్ హిస్ బీస్ట్లీ సొసైటీ" అనికూడా వ్రాస్తాడు. అదే నాక్కావలసింది. అని తనకు తానెచ్చరించుకుంది.

ఎక్స్కర్షన్‌కు అవధి "సోమవారం ఉదయం పదిగంటలకు బయల్దేరి అక్కడకు మధ్యాహ్నంకువెళ్ళి, ఆ పరిసరాన్నేవున్న కొండమీద సాయం సంధ్యలో తేనీరొకళ్ళొకళ్ళ ఆరోగ్యం కోసరంగాను తీసికోవడం."

* * * * *

"రంప" అనేది మన్నెపుల్లె. అది రాజమహేంద్రవరాని కిరవై మైళ్ళల్లో వున్న గోకవరం అనే గ్రామానికి మరో అంత దూరంలో వున్న చోడవరం అనే ఊరికి క్రోసుమేరలో వుంది. చోడవరందాకా పయనించడానికి మెయిల్ సర్వీస్ బస్‌వుంది. బస్ యొక్క ముందుసీటులో యువకుడు కూర్చున్నాడు. వెనక సీటులో వినయమ్మ కూర్చుంది. బస్సులో కూర్చున్న ఇతర ప్రయాణీకులో ముహూర్తం వారిద్దరికేసి ఎగాదిగా చూచారుగాని వారెవరికి వారి వృత్తాంత మేమిన్నీ బోధపడలేదు. ఎవరో ఉద్యోగస్థులన్నట్టూరుకున్నారు.

బస్ చోడవరంలో ఆగింది. మనవాళ్ళిద్దఱూ దిగారు అల్పాహారపరికరాల్తో. ఇద్దఱూ రంపకుదారిఎటూ? అంటు ఒకా నొకపుంత పుచ్చుకొని కాలినడకను సాగేరు.

యువకుణ్ని వినయమ్మ ఇలాప్రశ్నించింది. "ఈ రంప అనేదే అన్నింటికన్న రహస్యస్థానమా?" అని అడిగింది. యువకుడు రహస్యస్థానమనికాదు తీసికునివచ్చింది. ఇక్కడి వాతావరణము విప్లవ వాతావరణము. పూర్వమిది పితూరీకి ప్రసిద్ధి. సంఘ విప్లవాన్ని కోరే మనకు ఈ తావు ఉత్సాహం కలిగిస్తుందని నా నమ్మకం" అని జవాబు చెప్పాడు.

* * * * *

వెడుతూన్న కొద్దీ, వాగులనినాదాలు, పక్షుల కలకలా రావాలు, రకరకాల చెట్లయొక్క పువ్వుల పరిమళాలు, కొండల యొయ్యారాలు, అన్నీ ప్రకృతి ప్రభావానికి పునాది అదేనా అన్నట్టు కనబడదొడగినాయి. వినయమ్మ "పులులుండవుగదా ఇక్కడ?" అంది. యువకుడు తనవద్ద రైఫిల్ వుందని

ధైర్యంగొలిపాడు. కోయవాళ్ళ నిలయాలకూ పక్షుల కులయాలకు తేడాయేలేదు ఆ ప్రాంతంలో.

క్రమశః పొద్దువాలే అంతలో "పెద్దకొండ" ఆ ప్రేమికులిద్దరూ దరిసి కొండకేసిచూస్తూ "ఈ కొండమీదెక్కి మనసు విశాల ప్రేమను చాటగలిగితిమా సంఘము తలొంచుకు తీరుతుంది." అన్నాడు యువకుడు. "హిందూ సంఘము అను. స్వేచ్ఛఅన్నది క్రిస్టియన్ సంఘమున కీవఱకే ఉన్నది. హిందూ సంఘము అను" అన్నది వినయమ్మ. "నా హృదయంలో ఇన్ని సంఘాలులేవు. మానవసంఘం నేడు ప్రేమ సంఘము, అప్రేమ సంఘము అని రెండు తరహాలుగా కనబడుతూవుంది, అంతే" అన్నాడు యువకుడు. "అంతకంటె కడుపునిండిన సంఘము. కడుపునిండని సంఘము. అంటే మెరుగేమో" అని అంది వినయమ్మ. "ప్రేమను గురించి మాట్లాడేటప్పుడు ఆకలిని గురించి మాట్లాడకు. ప్రేమప్రేమే. అదిచివురున చివురొస్తుంది. పువ్వున పువుపూస్తుంది. ఆ కనబడే ఎత్తు బండమీద కూర్చుని మనం ఫలాహార మారగించి మనప్రేమను మేఘాల్లోకి చాటదాం! విరజిమ్ముదాం!" అంటూ నిజంగా గెంతేశాడు యువకుడు.

వినయమ్మ కెందుచేతనో అతని పలుకుల్లో సంపూర్ణమైన విశ్వాసం నాటిసాయంకాలం కుదరలేదు, అదివఱకు అతని మాటంటే గోస్పెల్‌లాపనిచేసేది. నాడు అదోవికలత్వం గొలిపింది. ఆమెకెక్కడనుండో ఏదిశనుండో ఎదోధ్వని, ఏదో "థడ్" ఏదోరొద వినవస్తూన్నట్టయింది. ఆ సంగతి చూచాయగా యువకునకు నివేదించింది గాని యువకుడు వినిపించుకో

కుండానే తిన్నగా ఆమెను ఆ కానవచ్చిన ఎత్తుబండమీద కెగ రేసి తీసుకుపోయినట్టు తీసుకుపోయినాడు.

ఫలాహారం ఇద్దరూ చేసిచేసి, టీ త్రాగిత్రాగి, మరిమరి మందా మందహాసాదుల జొక్కిచొక్కి సంభాషించుకుంటూ వున్నారు.

యువకుడు వినయమ్మయొక్క బాహువున మూలాన కంటయెగసి యున్న రైక గల్లీవంక తిలకిస్తూ "ఈ రకానివి మధ్యయుగం ఆడవాళ్లు తొడిగికొన్న వాటికంటె ఎక్కువ ఆరోగ్య పద్ధతి గలవిగా తోస్తాయి. గాలి స్వేచ్ఛగాపారుతుంది." అన్నాడు, తోడనే కితకిత పెట్టడానికి ఉద్యమిస్తూ. వినయమ్మ "గాలిపాఱడానికి చెట్లుండాలి. రైకగోట్లుకావు. ఎవరు చెప్పారి లాంటి సుద్దులు?" అంది చెయితప్పించి. "నీ ముద్దులు" అంటూ యువకుడు వినయమ్మను.

* * * * *

అదే నిమిషానకు ఆ వనంలో ఆకలిచే అటమటించుకు పోతూవున్న ఒకానొక కోయవాడు గొడ్డలి పుచ్చుకొని ఆ ప్రాం తాన్ని ఒక పెద్ద చెట్టును తన కడుపు కక్కుర్తికొద్దీ. కట్టె పుల్లలుగాకొట్టి అమ్ముకొందామనే తలంపుతో, నరుకుతూ వున్నాడు.

"నరకవయ్యా! నరకవయ్యా! నరకవయ్యా!
నీవేమికొడతావు? చింతచెట్టు.
వాడేమికొడతాడు? మా చిన్నచెట్టు
నేనేమికొడతాను! పెద్దచెట్టు!
నరకవయ్యా! నరకవయ్యా! నరకవయ్యా!"

అను పురాతనపు పాట చదువుతూ ఓ మహావృక్షాన్ని వేరులోకంటా తెగనరికాడు. దానివేరు వినయమ్మా యువకుడూ

కూర్చుని ముచ్చట లాడుకుంటూవున్న బండక్రింద కంటా చౌఆబారి తరతరాలనుంచి నాటుకు పోయివుంది. ఆకలిచిచ్చు కొద్దీ కొట్టిన కోయవాని నరుకుడు దెబ్బకు వేరుతెగడమేకాకుండా తెగినవేరు రాతిబండను లేవనెత్తి బండసమేతంగా ఆ కాముకుల నిద్దర్నీ కిందకు పడద్రోసింది. ఇద్దరూ వేరువేరు శరీరాలుగా దిగులోయలోకిపడి నశించిపోయినారు.

కోయవాడొక్క కన్నీటి చుక్కైనా వారికోసం కార్చ లేదు.

"నరకవయ్యా! నరకవయ్యా! నరకవయ్యా!" అని ఇంకా తుండ్లు తుండ్లుగా అమ్మహావృక్షాన్ని నరుకుతూనే వున్నాడు. ఎంత అంతులేని ఆకలోవానిది?

.... .... .... .... ....

## దారిలో వాన

బజారుచేసికుని ఇంటికివచ్చే దారిలో పెద్ద వాన పట్టుకుంది. ఇంతలోకే వానకురుస్తుందా అని గొడుగుకూడా తీసికుని వెళ్ళ లేదు. కట్టుకొన్న, తొడుగుకొన్న బట్టలు తడిసిపోకుండా ఇంటికి జేరుకోవడం అనేదే గొప్పసమస్య అయిపోయింది ఆ ప్రొద్దు–నాలాగే బజారుకి నడిచే చాలామంది జనమూను. వాళ్ళసమస్య నా సమస్య ఆ నిమిషం ఏకాంగీకారాన్ని వున్నట్టు కొందరు. కొందరు ఒక్కొక్క అరుగుమీదకో, ఒక్కొక్క పంచకో, ఆఖరుకు కనపడ్డ చాడీమీదకో చేరుకోగలిగాం. చెట్లక్రింద పళ్లు అమ్ముకునేవాళ్లు, మంగలిపని చేసేవాళ్లు, పనిచేయించుకునేవాళ్లు